# లవ్ స్టోరీ

## లాస్ట్ ఎవర్ లాస్టింగ్

గది తలుపులు తెరుచుకున్నాయి. మంచానికి అతుక్కుపోయిన అతని గాజు కళ్ళు మెరిశాయి. పెదాలు అస్పష్టంగా గొణిగాయి.

"షాహీ! నా షాహీ!!"

ఆత్రంగా పక్క మీంచి లేచాడు. నీరసంతో మళ్ళీ మంచంపై కూలబడ్డాడు. నమ్మలేనట్టుగా అడిగాడు మళ్ళీ "షాహీ! వచ్చేశావా... నా కోసం!?"

షాహిద మౌనంగా వచ్చి అతడి పక్కన కూర్చుంది. అతను విసురుగా తోసేశాడు. "కాదు. నువ్వు నా షాహీ కాదు. తనైతే రాగానే ముద్దాడేది."

ఆమె నవ్వుతూ దగ్గరగా వచ్చి అతడి మొహాన్ని దగ్గరకు లాక్కుంది. అతని నుదురు మీద ఆమె పెదవులు కొద్ది క్షణాలు కదలాడాయి. కొంచెం ఆగి అడిగింది.

"ఇంకా నమ్మటం లేదా?"

"నువ్వు...... నువ్వు చచ్చిపోయావని అంతా అంటున్నారు?" అనుమానంగా ప్రశ్నించాడు.

ఆమె చిన్నగా మునిపంట అతని ముక్కు కొరికింది. పెదాల్ని ముద్దాడింది.

"నమ్ముతున్నావా."

"ఇన్నాళ్ళూ ఎక్కడి కెళ్ళిపోయావ్. నేనేమైనా నీకు పట్టదా?"

"ఏయ్ పిచ్చీ! వచ్చేశాగా. ఇక విన్నొదిలి వెళ్ళను."

"ముందు ఎందుకెళ్ళిపోయావో చెప్పు" దూరంగా జరుగుతూ అన్నాడు.

"మొద్దూ! అంత కోపమా! ఒక్కసారి నవ్వరాదూ."

"నువ్వే మొద్దు"

"మొద్దు కాదూ, ముద్దు. నువ్వే ముద్దు అనాలి" గలగలా నవ్వేస్తూ అతని జుట్టు చెరిపేసింది. అతని కోపం ఎగిరిపోయింది.

"పద బీచ్ కెళదాం, చంద్రోదయవేళయ్యింది" అంది.

"నేను నీతో మాట్లాడదల్చుకోలేదు"

"ఫరవాలేదు. మౌనంగా వెళ్ళిరావచ్చు"

"నేను రాను"

కాసేపు బుజ్జగించింది. అతను వినలేదు. ఆమె కూడా మాట్లాడకుండా పక్కకి తిరిగి కూర్చుంది. కాసేపున్నాక వెళదాం పదమన్నాడు. ఇద్దరూ సముద్రంవైపు నడిచారు. సముద్రం ఒడ్డున వున్న పెద్ద బండరాయి మీదకి ఎక్కారు. ఎన్నో సార్లు మంచుతో తడుస్తూ ఆ బండరాయి మీద కూర్చుని సముద్రం మీద పూర్ణచంద్ర బింబాన్ని చిత్రించారు. అతను ఆమె వళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు. ఆమె అతని తల్లోకి వేళ్ళు పోనిచ్చి జుట్టు సవరిస్తూ మౌనంగా చంద్రోదయం చూస్తోంది. ఎంత వెన్నెల దాచుకుంది ఆ కళ్ళలోతుల్లో!! ఆ వేళ్ళ చివరల్నుంచీ ఎంత ప్రేమ కురిపిస్తుంది! ఇంత కాలం ఎలా వుండగలిగింది తను లేకుండా! తను మాత్రం ఆ కళ్ళలోకి చూకుండా, ఆమె పాట వినకుండా వుండలేకపోయాడు. అసలు తనకి షాహీ కన్నా షాహీ పాటే ఎక్కువ ఇష్టమేమో. ఆమెని పాట పాడమందామనుకున్నాడు. అతని మనస్సు గ్రహించిందో లేక కడలి కదిలించిందో ఆమే పాడడం మొదలు పెట్టింది.

"అందుకోరా చెందురూడా
కలువల మాటున నేనున్నా......"

అతను తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు. ఆమె పాడుతూనే వుంది. ఆమె వళ్ళో నిద్రలోకి జారిపోయాడు.

*　　*　　*

ముక్తాయింపు:- తెలతెలవారుతూనే చాపలు పట్టడానికి జాలరులు సముద్రం ఒడిలోకి వెళుతూ అతడ్ని చూశారు. తిరిగి వచ్చాక కూడ ఇంకా అక్కడే వున్న అతడ్ని గమనించి అనుమానంతో బండరాయి వద్దకి వచ్చి చూస్తే అతను అచేతనంగా పడి వున్నాడు.

రచయిత చిరునామా:
యోగానంద్.పి
నాగరాజ పాన్‌షాప్,
వెంకటేశ్వర కూల్‌డ్రింక్స్ పక్కన,
సోమశేఖరపురం,
నెల్లూరు-524 003



